
సింహాచలం రైల్వే స్టేషన్ ఏరియా మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి


ఎస్‌పడీ సెంటర్‌లో బాణ సంచా దుకాణాల వద్ద సందడి


అలంకరణ సామగ్రి

మార్కెట్‌కు దీపావళి శోభ

విశాఖ విద్య: వెలుగుల దీపావళి పండగ రానే వచ్చింది. చీకటిని పారదోలి కొత్త కాంతులు తీసుకొచ్చే దీపావళి పండగను ప్రతి ఇంటా ఆనందోత్సాహాల నడుమ జరుపుకుంటారు. కుటుంబ సమేతంగా బాణసంచా కాల్చేందుకు ఎంతో ఆసక్తి కనబరుస్తారు. ఆ వెలుగుల పండగ వేళ మార్కెట్‌కు కళ వచ్చింది. ఎన్‌ఏడీ, బాజీ జంక్షన్, గోపాలపట్నం ప్రధాన సెంటర్లలో దీపావళి పూజా సామగ్రి కొనుగోళ్లతో బుధవారం సాయంత్రం సందడి నెలకొంది. పూజ నిర్వహించేందుకు అవసరమైన పండ్లు, పూలు వంటి వస్తువులతో పాటు, కొత్త దుస్తులు, ఆభరణాలు కొనుగోలు చేశారు.

బాణసంచా దుకాణాల వద్ద రద్దీ

దీపావళి పండగ అంటే బాంబులు మోత మోగాల్సిందే. కాకర పువ్వొత్తుల కాంతులీనాల్సిందే. ఎన్‌ఏడీ సెంటర్, గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపంలో బాణసంచా విక్రయాల కోసం ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎన్‌ఏడీ పరిసర కానీలతో పాటు, పారిశ్రామిక ప్రాంతం, అదేవిధంగా గోపాలపట్నం వద్ద ఏర్పాటు చేసిన దుకాణాలకు సింహాచలం పరిసర కాలనీల నుంచి బాణసంచా కొనుగోలుకోసం ప్రజానీకం తరలివచ్చారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


బాజీ జంక్షన్‌లో ప్రమిదలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఈ జాగ్రత్తలు తీసుకోండి

- దీపావళి అందరి ఇళ్లలో వెలుగులు నింపే పండగ. గురువారం నుంచి నాగులచవితి వరకు ప్రతీ ఇంటా టపాసుల మోత మోగనుంది. ఈ సమయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలి.
- తారాజువ్వలు, చిచ్చుబుడ్లు కాల్చేటప్పుడు పక్కింట్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటివి వాటికి పిల్లలు దూరంగా ఉండేలా చూసుకోవాలి.
- రోడ్లపైకి బాణసంచా వెలిగించి విసిరేస్తే అటుగా వచ్చే వాహనాలపై పడే ప్రమాదం ఉంది. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు బాణసంచా కాల్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలి. దగ్గరలోనే బకెట్ లేదా డ్రమ్ముతో నీళ్లు పెట్టుకుంటే మంచిది.


చెరుకు గడలు

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా


మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధివిధానాలను ఆలోచించకుండా ప్రజల నుంచి అధిక విద్యుత్ చార్జీలను వసూలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం దుర్మార్గమన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయలు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తుందన్న చంద్రబాబు అధికారం చేపట్టి తర్వాత విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకాయని, వంటనూనె ధరలు రోజు రోజుకూ పెంచి ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ధరల నియంత్రణ చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గిస్తున్నట్లు ప్రకటించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, విశాఖ జిల్లా సమితి సభ్యులు గండి అప్పారావు, త్రినాథ్, కామేశ్వరరావు, శ్రీనివాస్, కనకేశ్వరరావు, వెంకట్, గోపి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్టీఆర్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన


ఎన్టీఆర్‌కాలనీలో వ్యర్థాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్‌కాలనీలో బుధవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. యూజీడీ, శానిటేషన్ సమస్యలను స్థానికులు కార్పొరేటర్ లక్ష్మణరావు దృష్టికి తీసుకువెళ్లారు. లక్ష్మణరావు మాట్లాడుతూ యూజీడీ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. వీధుల్లోకి వస్తున్న వాహనాలకు చెత్త అందజేయాలని సూచించారు. పరిశుభ్రత అందరి బాధ్యత అని చెప్పారు. ఇకపై వ్యర్థాలు వేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డీఈవోకు సత్కారం


డీఈవోకు అభినందనలు తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ప్రేమ్‌కుమార్‌ను బుధవారం పీఆర్‌టీయూ జిల్లా కమిటీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాపై పట్టు ఉన్న అధికారిగా విద్యాశాఖను పురోభివృద్ధిలో నడిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. శ్రీనివాసరావు, కొమ్మనాపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు బి. మహేష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రమణ, ఈఈ చిరంజీవి

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ పరిశీలించారు. ఎన్‌ఏడీ ఆస్పత్రి నుంచి డీఏవీ స్కూల్ వరకు , అదే విధంగా సీతారామరాజు నగర్, ఏపీఎస్ఈబీ కాలనీలను అనుసంధానం చేస్తూ చేపడుతున్న రహదారి నిర్మాణ పనులపై ఆరా తీశారు. వార్డు పరిధిలో పలు కాలనీల్లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఈఈ చిరంజీవి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ అటెండర్‌కు సన్మానం


రాజారావును సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏలో 40 ఏళ్లపాటు అటెండర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన మామిడి రాజారావును అధికారులు ఘనంగా సన్మానించారు. బుధవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సంయుక్త కమిషనర్, కార్యదర్శి రమేష్, ఇతర అధికారులు రాజారావు దంపతులను సాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ రాజారావు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని ప్రశంసించారు.

● జాగ్రత్త సుమా..

ఎన్‌ఏడీ చుట్టు పక్కల ఉన్న ప్రైవేటు స్కూళ్లకు ఆటోల ద్వారా పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్నారు. ఆటోకు వెనుక, ముందు భాగంలో విద్యార్థులను కూర్చోబెట్టవద్దని రవాణ శాఖ అధికారులు చెబుతున్నా కొంత మంది ఆటోవాలాలు ఇవేమీ పట్టించుకోవడం లేదు. సడెన్ బ్రేక్ వేస్తే, వెనుక కూర్చొనే విద్యార్థులు జారి పడే ప్రమాదం ఉందని తెలిసినా తల్లిదండ్రుల్లోనూ మార్పు కనిపించటం లేదు. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌కు సమీపంలో బుధవారం కనిపించిన దృశ్యమిది. -విశాఖ విద్య



విశాఖ ఉక్కును అదానీకి అప్పజెప్పడమే అజెండా

కార్పొరేటర్ గంగారావు


మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కారుచౌకగా అదానీ కంపెనీకి అప్పగించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో బుధవారం చేపట్టిన 1357వ రోజు దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. గంగవరం పోర్టును కొట్టేసిన అదానీ వాటిని ఆనుకొని ఉన్న వేలాది ఎకరాల భూమిని కాజేయడానికి కుట్రలు పన్నితే, వాటిని కేంద్ర ప్రభుత్వ పెద్దలు అమలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులను తొలగించడం, వేరే సంస్థల్లోకి బదిలీ చేయడం, స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో వేలాది మంది ఉద్యోగులను ఇంటికి వంపించేసి అరకొరగా మిగిలిన ఉద్యోగులతో స్టీల్‌ప్లాంట్‌ను అదానికి అప్పగించడం కోసం ప్రభుత్వం యత్నిస్తుందని ఆరోపించారు. విశాఖ ఉక్కు నిర్వాసితుల త్యాగం వల్ల వేలాది ఎకరాలు స్టీల్‌ప్లాంట్‌కు దఖలు పడ్డాయని, ఇప్పుడు వారికి కూడా పంగనామాలు పెట్టాలని చూస్తున్నారన్నారు. ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు ఐక్య ఉద్యమం చేపడితే కేంద్రం దిగిరాక తప్పదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, పెదిరెడ్ల నీలకంఠం, శ్రీనివాస్‌రెడ్డి, విందుల నరసింహానాయుడు (కోలాటం నాయుడు), పి.జి.కె.రాజు, నాగేశ్వరరావు, పెంటయ్య, దుర్గాప్రసాద్, పట్టా రమేష్ పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా విడుదల చేయాలి


డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

విశాఖ విద్య: మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించి సీనియారిటీ జాబితాలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో ప్రేమ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ఈ నెల 28 నాటికే సీనియారిటీ జాబితాలను బహిర్గతం చేయాల్సి ఉండగా.. డీఈవో కార్యాలయ అధికారులు తాత్సారం చేయడం సరికాదన్నారు. అభ్యంతరాల స్వీకరణకు తుది గడువుగా నవంబర్ 1 అని పేర్కొనడం జరిగిందని, సీనియారిటీ జాబితాలే ప్రకటించకుంటే, ఉపాధ్యాయులు వాటిని ఎలా పరిశీలించుకుంటారని ప్రశ్నించారు. సీనియారిటీ జాబితా విడుదల చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని డీఈవోను కోరారు. కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్, సీనియర్ నాయకులు బి.జనార్దన్, చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి, గౌరవాధ్యక్షులు ఎస్.ప్రసాద్, శేఖర్, నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు కోసం పోరాడండి



రైల్వేస్టేషన్ వద్ద కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఆటో డ్రైవర్లు

తాటిచెట్లపాలెం : ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు సాధించేందుకు పోరాడాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్ వద్ద గల విజయదుర్గా ఆటో స్టాండ్‌లో ఏఐటీయూసీ జెండాను స్టాండ్ అధ్యక్షుడు వై.వెంకట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ అక్టోబరు 31న ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి, నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామన్నారని... మూడోసారి ప్రధాని పగ్గాలు చేపట్టిన మోడీ ఒక్క హామీనీ నెరవేర్చలేదని మండిపడ్డారు. ఉద్యోగ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు మోడీ పాల్పడుతున్నారని విమర్శించారు. ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారం మోపే జీవో నంబర్ 2131 రద్దు చేస్తామని, డీజిల్, పెట్రోల్ రేట్లు తగ్గిస్తామని, వాహనమిత్ర కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీనైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మోటార్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాగ్రాహానికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కేలం శివ, హెచ్.శేఖర్, ఎస్.సుధాకర్, పి.నరేష్, చంటి పాల్గొన్నారు.

స్వచ్ఛతతో పర్యావరణ పరిరక్షణ


ఆటోనగర్‌లో మొక్కలు నాటుతున్న పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్‌ఎంఈ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై ప్రత్యేక ప్రచార కార్యక్రమం 4.0 ను నిర్వహించారు. ఆటోనగర్ డి - బ్లాక్‌లోని సజ్జాస్ విష్ణుటెక్ ఇంజినీరింగ్ వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ అధికారులు మొక్కలు నాటారు. చీపుర్లు చేత పట్టి రోడ్లను శుభ్రపరిచారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ కరోనా సమయంలో మరణాలను అధిగమించడానికి కారణం ప్రతీ ఒక్కరు స్వచ్ఛతా ప్రమాణాలు పాటించడమే అన్నారు. స్వచ్ఛత హీసేవా నియమాలపై ఎంఎస్ఎంఈ అధికారులు, పారిశ్రామిక వేత్తలచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రొగ్రాం ఆర్డినేటర్ ఏడీ బి.ప్రభాకర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీ గ్రేడ్-1 చంద్రమౌళి, శ్రీను అప్పికొండ, వినోద్, సుబ్బారావు, సన్యాసిరావు, ఐలా కమిషనర్ కిషోర్, చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), ప్రధానకార్యదర్శి చీకటి సత్యనారాయణ, మాజీ ప్రతినిధులు శేషగిరిరావు, వై.సాంబశివరావు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తల అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, సీహెచ్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కారు- కాలేజీ బస్సు ఢీ

బీఆర్టీఎస్ రోడ్‌లో ట్రాఫిక్ జామ్


పెందుర్తి వైపు నిలిచిపోయిన వాహనాలు


బస్సు ముందు భాగంలో ఇరుక్కున్న కారు


ఎన్‌ఏడీ వైపు నిలిచిన వాహనాలు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ-పెందుర్తి బీఆర్టీఎస్ రోడ్‌లో గోపాలపట్నం బంకు సెంటర్‌లో బుధవారం సాయంత్రం కారు- కాలేజీ బస్సు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఎన్‌ఏడీ వైపు వస్తున్న రెండువాహనాలు బంకు సెంటర్‌లో ఒకదానికి మరొకటి ఢీ కొన్నాయి. బస్సు ముందు భాగాన్ని కారు బలంగా ఢీకొట్టింది. దీంతో రహదారి మధ్యలో రెండు వాహనాలు నిలిచిపోవడంతో ఇటు ఎన్‌ఏడీ, అటు పెందుర్తి వైపు ట్రాఫిక్ జామ్ అయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ట్రాఫిక్ పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే ప్రయత్నం చేశారు. అయితే బస్సు చక్రంలో కారు ముందు భాగం ఇరుక్కుపోవడంతో దాన్ని పక్కకు తొలగించేందుకు చాలసమయం పట్టింది. సాయంత్రం సమయంలో ఎన్‌ఏడీ నుంచి పెందుర్తి వరకు దారిలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో ప్రమాదం చోటుచేసుకోవడంలో వాహనాలు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. కాలేజీ బస్సులో విద్యార్థులంతా క్షేమంగానే ఉన్నారు. దీపావళి పండగకు ఇళ్లకు, సొంత గ్రామాలకు వాహనాలపై వెళ్లేవారు ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం బంక్ సెంటర్ వరకు ప్రధాన సెంటర్లలో తరచూ ఇదే రీతిన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు చెబుతున్నారు.

బాణసంచా దుకాణాలను పరిశీలించిన డీసీపీ


దుకాణాలను పరిశీలిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను డీసీపీ-2 మేరీ ప్రశాంతి బుధవారం పరిశీలించారు. బాణసంచా దుకాణాల ఏర్పాటులో లోపాలు ఎత్తి చూపుతూ 'నిబంధనలు తూచ్' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. వెస్ట్ జోన్, ఎయిర్ పోర్టు పోలీసులతో కలసి బాణసంచా దుకాణాలను ఆమె పరిశీలించారు. డీసీపీ స్వయంగా దుకాణాలన్నీ పరిశీలన చేసి, ఫైర్ సేఫ్టీ వంటి ముందు జాగ్రత్తలు అన్నీ అప్పటికప్పుడు ఏర్పాటు చేయించారు.

ఉద్యోగుల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి

హిందుస్థాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి


టైప్ సీ అండ్ డీ క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ హేమంత్ ఖత్రి

సింథియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, ఉద్యోగుల్లో సామాజిక స్ఫూర్తిని పెంపొందించేందుకు కట్టుబడి ఉన్నామని సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రి అన్నారు. బుధవారం షిప్‌యార్డ్ కాలనీలో పునరుద్ధరించిన టైప్ సీ అండ్ డీ క్వార్టర్స్‌ను ప్రారంభించి, ఉద్యోగులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు అకింత భావంతో పనిచేసి సంస్థను లాభాల బాటలో నడిపించాలన్నారు. అనంతరం నివాసితులను అవసరమైన నిత్యావసర తదితర సరకుల కోసం కాలనీ దగ్గర్లోని వాల్‌చంద్ గేట్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

నర్సులపై దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్

మహారాణిపేట: విధి నిర్వహణలో ఉన్న నర్సుపై రోగి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనను ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు టి.గంగా భవానీ ఖండించారు. రోగులకు సేవలందించడంలో నర్సులు కష్టపడి పని చేస్తున్నారని, రోగులు, వారి సహాయకులు నర్సులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. దీనిపై అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న నర్సులకు భద్రత కల్పించాలని కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి కోరారు.